# సంస్కారం

ఆర్.చంద్ర



సుశీల పదిహేనేళ్ల అమ్మాయి. కాన్వెంట్ స్కూల్లో చదువుతోంది. క్లాసులో ఫస్ట్ వస్తోంది. చాలా అందంగా ఉంటుంది. ఇన్నిఉండి ఏం లాభం? సంస్కారం లేదు. ఇతరులతో ఎలా ప్రవర్తించాలో తెలీదు.

బెడ్ కాఫీ తాగడం సుశీలకు బాగా అలవాటు. ఓ రోజు ట్రేలో కాఫీ తెచ్చింది రాధమ్మ.

"సుశీలా! కాఫీ తీసుకో!" అంటూ సుశీలకందించింది.

సిప్ చేసి చిరుకోపంతో గ్లాసును విసిరికొట్టింది.

రాధమ్మ ఉలిక్కి పడింది.

"నీ మొహంలా ఉందాకాఫీ! పంచదార కలపాలని తెలీదా?" ఎరుపెక్కిన కళ్ళతో పనిమనిషి అడిగింది సుశీల.

"నువ్వు మనిషివా, పశువ్వా? చక్కెర లేదని గ్లాసుని అలా విసిరి కొట్టడమేనా? ఇదేనా నువ్వు స్కూల్లో చదువుకున్నది?" అంటూ కూతుర్ని మందలించసాగింది పార్వతి.

"ఆహా! చదువు సంస్కారం గురించి మహా చెప్పొచ్చావ్! నేను పాలుతాగే పసిపాపని కానని తెలుసుకో" అలా అని తల్లి మనసు నొప్పించింది సుశీల.

"నీతో మాట్లాడడం కంటే నోరు మూసుకుని ఉండటం మేలు! పద రాధమ్మ, నువ్వేం బాధపడకు!" అంటూ ముందు గదిలోకి వెళ్ళిపోయింది పార్వతి.

ఆ రోజు మధ్యాహ్నం భోజనాల దగ్గరకూడా అలాగే గొడవ చేసింది సుశీల.

"రాధమ్మా! కూరలో ఉప్పులేదు. కారం లేదు! నువ్వుచేసిన ఈ వంట కుక్కకూడా తినదు! నిన్ను పనిలోంచి డిస్మిస్ చేస్తున్నాను! ఇక నువ్వు వెళ్ళొచ్చు" పనిమనిషి మీద మండిపడింది సుశీల. ఆ మాటలు వినగానే బామ్మ నిర్ఘాంతపోయింది.

వెంటనే—

"నువ్వు పుట్టకముందే పనిలోచేరిన రాధమ్మని డిస్మిస్ చేయడానికి నీకున్న అధికారం ఏమిటి?" అడిగిందిపార్వతి.

"ఐ హేవ్ రైట్ టు డూ ఎనీ-థింగ్! నేనేమైనా చేస్తాను. అడగడానికి నువ్వెవ్వరు?" అంది సుశీల, తల్లికేసి చూస్తూ.

బామ్మ ఇంక మౌనంగా ఉండలేకపోయింది. ఆవిడ వెంటనేఅందుకుంది.

"ఎవరా! నవమాసాలు మోసి ఎన్నో కష్టాలను ఎదుర్కొని నిన్ను కన్నతల్లి. పాలిచ్చి, కంటికి రెప్పలా కాపాడుకుని ప్రాణంలో ప్రాణంగా చూసుకుని, అల్లారు ముద్దుగా పెంచి పెద్దచేసిన మాతృమూర్తి. అలాంటి తల్లి ఋణం ఎన్నడూ తీర్చుకోలేవే.

"కాన్వెంటు స్కూల్లో చదివి రెండు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకున్నంత-మాత్రాన ఈ ప్రపంచాన్నే జయించగల ననుకోకు. అహంభావంతో నీ తల్లినికూడా గౌరవించలేకపోతున్నావ్! నీకన్నా ఎక్కువగా చదువుకున్న వాళ్ళు ఉన్నారే ఈ లోకంలో. నీతండ్రి, బాబాయి కూడా పెద్ద పెద్ద చదువులు చదువుకున్నారు. వాళ్ళు ఎన్నడూ నీలా నిష్ఠూరంగా మాట్లాడలేదు. నన్ను గౌరవించి, దైవంగా భావించారు! అందరిలో మంచి పేర్లు తెచ్చుకున్నారు. కానీ నువ్వు నోటికొచ్చినట్టు వాగి అందరినీ అవమానిస్తున్నావ్. ఈ మహాతల్లి కడుపున చెడపుట్టావ్. "చదువుంటే చాలదు సంస్కారంకూడా ఉండాలి!" అన్నారు పెద్దలు. నీకు చదువుంది. కానీ సంస్కారం లేదు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. పెద్దవాళ్ళను గౌరవించి, ఆదరించు. వాళ్ళ మనసు నొప్పించకుండా వినయంగా మాట్లాడు. వాళ్ళను ఎదిరించకు" అంటూ ముందు గదిలోకి వెళ్ళిపోయింది బామ్మ.



సుశీలకు ఒళ్లు మండింది. కోపంతో ఆమె కళ్ళు ఎరుపెక్కాయి. "నువ్వు నాకు నీతులు చెప్పక్కర్లేదు" బామ్మ మీద మండి పడింది సుశీల. సుశీలతో మాట్లాడడం అనవసరం అనిపించింది బామ్మకి. అందుకే మౌనంగా ఊరు కుంది.

"అమ్మా.... అయ్యో...." అంటూ పడకగదిలోంచి అరుపులు వినిపించాయి పార్వతికి. వెంటనే పడకగదిలోకి వెళ్ళింది. మెలికలు తిరిగిపోతున్న కూతుర్ని చూసి ఒళ్ళంతా వణికి పోయింది పార్వతి.

"ఏమైంది తల్లీ!" సుశీల దగ్గరకు వచ్చి భుజంమీద చెయ్యివేసి గాభరాగా అడిగింది పార్వతి. "అమ్మయ్యో! ఒళ్ళంతా కాల్తుందే!" అంటూ లేచి.

"రాధమ్మా? ఓ రాధమ్మా! ఒక్కసారి ఇటు రా!" పెరట్లో ఉన్న రాధమ్మకు వినబడేలా అరిచింది పార్వతి. పార్వతి మాతృహృదయం విల విల లాడింది. ఆమె ముఖంలో కంగారు కనిపించసాగింది.

"ఏంటమ్మగారూ!" అంటూ పడక గదిలోకి వెళ్ళింది రాధమ్మ.

"సుశీలకు జ్వరం వచ్చింది. నువ్వు వెంటనే వెళ్ళి డాక్టర్ని తీసుకురా!" దుఃఖం నిండిన కంఠంతో అంది పార్వతి.

"నా చిట్టి తల్లీ! నేనిప్పుడే వెళ్ళి డాక్టర్ని తీసుకొస్తాను." ఓదార్పుగా సుశీల భుజంమీద చెయ్యి వేసి చెప్పి, "వెళ్ళొస్తాను అమ్మగారూ!" అంటూ చక చక అడుగులేసుకుంటూ బయటికి వెళ్ళిపోయింది రాధమ్మ.

"అమ్మా! నాకెదోలా ఉందమ్మా! కళ్ళు తిరుగుతున్నాయి. ఒళ్ళంతా నొప్పులు పెడుతున్నాయి. భరించలేక పోతున్నాను!" బాధతో అంది సుశీల.

"కాసేపు ఓపికపట్టు తల్లీ! డాక్టర్ గారు వచ్చేస్తారు. నా బంగారు తల్లివి కదూ!" కూతుర్ని ఓదార్చ సాగింది పార్వతి. వెంటనే దుఃఖం ముంచు కొచ్చేసింది పార్వతికి. అప్రయత్నంగా ఆమె కళ్ళవెంట కన్నీళ్ళు కూడా తిరి గాయి.

ఆ రోజు డాక్టర్ వచ్చి, సుశీలను పరీక్ష చేసి, ఆమెకు టైఫాయిడ్ ఉందని చెప్పాడు. ఇంజక్షన్ ఇచ్చి, మందులు రాసిచ్చాడు. వారం రోజులు మంచం మీదనుంచి లేవలేదు సుశీల. ఆ వారం రోజులు సుశీల దగ్గరుండి అన్ని సేవలు చేసింది పార్వతి.

"సుశీలా! అమ్మా సుశీలా" అని నిద్రపోతున్న కూతుర్ని తట్టి లేపింది పార్వతి. మెల్లిగా కళ్ళుతెరిచి చూసింది సుశీల. పాలు తాగు సుశీలా!" అంది పార్వతి.

మెల్లిగా లేచి కూర్చుంది సుశీల. పార్వతి అందించిన గ్లాసుని అందుకుని గబగబా తాగేసింది. "ఇప్పుడు ఒంట్లో ఎలా ఉందమ్మా?" సుశీల భుజంమీద చెయ్యి వేసి ఆప్యాయంగా అడిగింది పార్వతి. ఒక్కసారి తల్లి ముఖంలోకి చూసింది. వెంటనే మొహాన్ని చేతుల్లో తీసుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది. పార్వతి అంతా అయోమయంగా ఉంది. "ఏమైంది సుశీలా? ఎందుకు ఏడుస్తున్నావ్?" సుశీల మొహం మీద నుంచి చేతులుతీసి అడిగింది పార్వతి. "అమ్మా నిన్ను అవమానించాను. నీ మనసు నొప్పించాను. నీ హృదయాన్ని గాయ పరిచాను. నన్ను క్షమించమ్మా క్షమించు."

రెండుచేతులు జోడించి, పశ్చాత్తాపంతో కుమిలిపోతూ అంది సుశీల.

"అయ్యో! అందుకేనా ఇంతగా కుమిలిపోతున్నావ్! ఊరుకో తల్లీ!" సుశీల బుగ్గలమీదుగా కారుతున్న కన్నీళ్ళను తుడిచి, "చూడు! జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు అవన్నీ తలచుకుని మనసు పాడు చేసుకోకు! నా మాటవిని జరిగిందంతా మర్చిపో. నా బంగారు తల్లివికదూ" కూతుర్ని హృదయానికి హత్తుకుని ఆప్యాయంగా అంది పార్వతి.

"నీ హృదయాన్ని గాయపరిచిన నా మీద నీకెందుకమ్మా అంత ప్రేమ!" తల్లికేసిచూసి అడిగింది సుశీల.

"నిన్ను నవమాసాలు మోసి కన్నాను కదమ్మా." అంది పార్వతి.

"అమ్మా! నువ్వెంత మంచిదానివమ్మా! నీలాంటి తల్లి దొరకడం నా అదృష్టం!" ఆనందం నిండిన కంఠంతో అంది సుశీల.

అప్పుడే పడక గదిలోకి వచ్చిన రాధమ్మని చూసి–

"రాధమ్మా! నువ్వుకూడా మనిషివేనని, నీకూడా మనసు ఉంటుందని, ఇప్పుడే గ్రహించాను. నన్ను క్షమించు అంది సుశీల, రాధమ్మకేసి చూస్తూ.

సుశీలని గుండెకు హత్తుకుని నుదుట ముద్దాడింది రాధమ్మ. అందరి కళ్ళలో ఆనంద బాష్పాలు!

"సంస్కారం లేని మనిషి అసలు మనిషే కాదని తెలుసుకున్నాను" అంది సుశీల. ✻

యం.కె. సుగమ్‌బాబు
కలం అందిస్తున్న
జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతల
పరిచయమాలిక
త్వరలో!

రూ. 1,25,000/- విలువగల బహుమతులు గెలుచుకోండి - ప్రవేశ రుసుము లేదు

మొదటి బహుమతి: రాజ్‌దూత్ మోటర్ సైకిల్ లేదా రూ. 10,000/- రొక్కము.

కన్సోలేషన్ బహుమతులు: సరికొత్త జపాన్ మోడల్ టూ-ఇన్-వన్ రూ. 250లకే. చైన్‌లింక్ స్కీమ్ క్రింద

| | | |
|---|---|---|
| 18 | | |
| | 19 | |
| | | 20 |

ఈ ప్రక్క గళ్ళలో అంకెలను 15 నుండి 23 వరకు వాడి, నిలువుగాను, అడ్డంగాను. ఏ విధంగా కూడినా మొత్తం 57 వచ్చే విధంగా ఉండాలి. ఒక అంకెను ఒకసారి మాత్రమే ఉపయోగించాలి. మీ ఎంట్రీలను 15 రోజులలోగా పంపండి.

| | | |
|---|---|---|
| 19 | 24 | 17 |
| 18 | 20 | 22 |
| 23 | 16 | 21 |

**DEEPAK ENTERPRISES (MH)**

86, GOVIND NAGAR, AMBALA CANTT.